COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-9, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,
తేది : 14 మార్చి, 2023.

# లెక్కల గారడీతో మభ్యపెట్టిన గవర్నర్ ప్రసంగం

అసెంబ్లీ ప్రారంభంలో గవర్నర్ చేసిన ప్రసంగం రాష్ట్రాభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని, సామాజిక న్యాయాన్ని మరుగుపరచి అంకెల గారడీలతో మభ్యపెట్టి వంచన చేసే విధంగా ఉంది. ఈ నాలుగేళ్ళలో కొత్తగా పరిశ్రమలు పెట్టినట్లు గాని, ఉపాధి కల్పించినట్లు గాని చెప్పలేని దుస్థితిలో ఉన్నది. రాబోయే రోజుల్లో చేయబోయే ప్రణాళికల్ని భూతద్దంలో పెట్టి చూపించారు. గత నాలుగు సంవత్సరాలుగా నవరత్నాల పేరుతో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు, నగదు బదిలీ పథకాల లెక్కలతోనే ప్రసంగం అంతా నిండిపోయింది. ఇందులో కొత్తదనమేమీ లేదు. కొత్త పథకాలూ లేవు. యువత భవిష్యత్తుకు భరోసానిచ్చే అంశాలూ లేవు.

కేంద్రం రాష్ట్రానికి చేసిన అన్యాయం, రావాల్సిన నిధుల గురించి కనీస ప్రస్తావన లేదు. ప్రత్యేక హోదా, విభజన హామీల ఊసు లేదు. కేంద్రం రాష్ట్రానికి చేసిన విద్రోహాన్ని ప్రస్తావించకపోవడం రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టడమే. మొత్తంగా గవర్నర్ ప్రసంగం నిరాశాజనకంగా సాగింది.

కార్మికుల కనీస వేతనాల పెంపు ఊసు లేదు. కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్‌ను విస్మరించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలు, సిపిఎస్ రద్దు ప్రస్తావన లేదు. మంత్రి పదవులతో సామాజిక న్యాయం రాదు. దిశ యాప్‌తో మహిళలకు రక్షణ దొరకలేదు. చట్టం అమలు వూసే లేదు.

గిరిజనులకు భూములపై హక్కు, విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో గిరిజనులను వెళ్ళగొట్టడం వంటి దుర్మార్గమైన చర్యల గురించి ప్రస్తావన లేదు. గిరిజన విద్యావంతులకు ఉపాధి లేదు. ఉన్న జివో నం.3ను పునరుద్ధరించే ప్రయత్నం చేయలేదు. 1/70 అమలు, పీసా చట్టం అమలుపై మాటవరసకు కూడా ప్రస్తావన లేదు. భాషా వలంటీర్ల తొలగింపుపై మాట్లాడలేదు. రద్దైన ఎస్సీ, ఎస్టీ పథకాల పునరుద్ధరణ గురించి మాట్లాడలేదు.

గత నాలుగేళ్ళలో సంక్షేమ పథకాల కోతలు తప్ప కొత్తవారికి విస్తరించలేదు. జగనన్న ఇళ్ళు 21.25 లక్షలకు గాను 4.4 లక్షలు మాత్రమే పూర్తయ్యాయి. వైఎస్సార్ జలకళ పూర్తిగా విఫలమయ్యింది. జగనన్న పాలవెల్లువను అమూల్‌కు కట్టబెట్టారు. సంస్కరణల పేరుతో ఆస్థి పన్ను పెంచారు. చెత్తపన్ను విధించారు. అనేక పట్టణాలకు మంచినీరు లేక విలవిల్లాడుతున్న వాస్తవాన్ని విస్మరించింది ఈ ప్రసంగం. రాష్ట్ర ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న పోలవరం ప్రాజెక్టులో పునరావాసం కేవలం 22 శాతమే పూర్తయిందని చెప్పారు. 78% పెండింగులో ఉండగా ప్రాజెక్టు ఎలా పూర్తవుతుంది? వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి 6,500 కోట్లు కట్టబెట్టి ఏం సాధించారో చెప్పలేకపోయారు. చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం లేకపోగా టెక్స్‌టైల్స్, చక్కెర, డైరీ, ఆయిల్ మిల్లులు తదితర పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. స్థానికులకు 75% ఉద్యోగాలు కలగానే మిగిలిపోయింది. గ్రామీణ ఉపాధి పథకం బకాయిల గురించిన ప్రస్తావన లేదు. భూరక్ష హక్కు పత్రాల పేరుతో చేసిన సర్వే కొత్త సమస్యలను సృష్టించి రైతులకు లేని చిక్కులను కొనితెచ్చింది. ధరల పెరుగుదల అరికట్టే విషయంగా గాని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి గురించి చెప్పలేదు.

ఇలా ప్రజా సమస్యలను విస్మరించి ప్రభుత్వ గొప్పలను చెప్పుకోవడానికి అసెంబ్లీ వేదికగా గవర్నర్ ప్రసంగం సాగింది. చర్వితచరణంగా సాగుతున్న ఇలాంటి ప్రసంగాలతో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదు.

**(వి. శ్రీనివాసరావు)**
రాష్ట్ర కార్యదర్శి